TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 61 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శుక్రవారం | జూన్ 12, 2026

## 'సర్' ఓ భయంకరమైన భూతం..



**కేంద్రానివి దొంగదారి కుట్రలు**

**రాష్ట్ర మంత్రి పొంగులేటి**

**చట్టం ముసుగులో ఓట్లు తొలగించేందుకు కేంద్రం వ్యూహాలు**

**ప్రతి ఓటూ కాపాడాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లదే..**

2లో..

**ఖమ్మం, వాయిస్ ఆఫ్ వంద భారత్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ అనేది చట్టం ముసుగులో దెబ్బకొట్టే ఒక భయంకరమైన భూతం లాంటిదని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. ఇది కేంద్రం ఎంచుకున్న ఒక దొంగదారి అని ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల అవగాహన సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధికారులు ముందుగా ఓటు మ్యాపింగ్ చేస్తారని, గ్రామాల వారీగా ఓట్లు తొలగించే సమయంలో బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఓటర్ లిస్ట్ సవరణల పేరిట రకరకాల కారణాలు వెతుకుతూ ఉద్దేశపూర్వకంగా ఓట్లను తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి ఆందోళన వ్యక్తం చేశారు. "గతంలో ఈ ఎస్ఐఆర్ వ్యూహం ద్వారానే రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్ర ప్రభుత్వం అన్యాయంగా ఓడించింది. ఇప్పుడు తెలంగాణలోనూ అలాంటి కుట్రలకే తెరలేపారు. ఈ ఓట్ల తొలగింపు ప్రక్రియను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాల్సిన పూర్తి బాధ్యత మన బీఎల్ఏలదే. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న అభిమానాన్ని, ఓటు బ్యాంకును కాపాడుకుంటే చాలు." అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున నిలబడిన మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే తాము గెలవలేమని తెలిసి కూడా బీజేపీ అక్కడ అభ్యర్థిని నిలబెట్టిందని మంత్రి విమర్శించారు. లేనిపోని సాంకేతిక కారణాలు, నోటీసులను అడ్డం పెట్టుకుని, అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించడం వెనుక కేంద్ర పెద్దల హస్తం ఉందన్నారు. గతంలో ఓట్లు దొంగిలించిన బీజేపీ, ఇప్పుడు ఏకంగా ప్రతిపక్షాల సీట్లను దొంగిలించే స్థాయికి దిగజారిందని ధ్వజమెత్తారు. కేంద్రంలో లబ్ధి పొందడమే లక్ష్యంగా సాగుతున్న ఇటువంటి ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలను మనమందరం సమిష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ సీబీఐ, ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని గెలిచిన ప్రజాప్రతినిధులను తమ వైపు తిప్పుకునేందుకు బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతోందని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇలాంటి కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి పార్టీ శ్రేణులంతా ఏకతాటిపై నిలిచి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కష్టపడాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును కాపాడుతూ జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు దిశానిర్దేశం చేశారు.

## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

**మాజీ మంత్రి హరీశ్ రావు**

**కాంగ్రెస్ ఖతం కావడం ఖాయం**

**వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవు..**

**సిద్దిపేట ఎమ్మెల్యే జోస్యం**



2లో..

## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- 'స్ట్రాంగ్ కౌంటర్' ఇచ్చిన జైశంకర్
- రష్యాతో చమురు కొనుగోళ్లపై గట్టి సమర్థన
- 'అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదు..
- నాడే చమురు కొనమన్నారు'
- అంతర్జాతీయ వేదికపై ఎండగట్టిన భారత్

2లో..



## స్కూలు డ్రెస్సుల కుంభకోణం

- కాంట్రాక్టులో రూ.2,000 కోట్ల గోల్ మాల్
- గుజరాత్ కంపెనీకి పనులు కట్టబెట్టడంపై అనుమానం
- హరీశ్ రావు ఆరోపణలపై నిజాలు తేలాలి
- కమిషన్ల కోసమే బడుల ప్రారంభం వాయిదా వేశారా?
- వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

2లో..



## హనీట్రాప్‌లో చిక్కుకున్న మహిళా న్యాయమూర్తి



2లో..

- రూ.52 లక్షలు స్వాహా!
- టిండర్ యాప్ పరిచయంతో బురిడీ కొట్టించిన కేటుగాడు
- పనిమనిషితో ఫిర్యాదు చేయించిన జడ్జి..
- గుట్టురట్టు చేసిన సెషన్స్ కోర్టు
- దర్యాప్తులో లోపాలపై కోర్టు ఆగ్రహం..
- నిందితుడి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, జూన్ 12, 2026

## స్కూలు డ్రెస్సుల కుంభకోణం

- కాంట్రాక్టులో రూ.2,000 కోట్ల గోల్ మాల్
- గుజరాత్ కంపెనీకి పనులు కట్టబెట్టడంపై అనుమానం
- హరీశ్ రావు ఆరోపణలపై నిజాలు తేలాలి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్కూల్ డ్రెస్సుల సరఫరా కాంట్రాక్టులో గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో దాదాపు రూ.2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. కేవలం కాంట్రాక్టులు, కమిషన్ల కోసమే ప్రభుత్వం పాఠశాలల పునఃప్రారంభాన్ని కూడా వాయిదా వేసిందని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంపై నిజానిజాలను వెల్లడించాల్సిన బాధ్యత పూర్తిగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతను స్థానిక చేనేత కార్మికులకు, మహిళా సంఘాలకు అప్పగించామని హరీశ్ రావు గుర్తు చేశారు. అలాగే దళిత కుటుంబాలకు ఆర్థిక అండగా నిలవాలనే ఉద్దేశంతో షూ, బెల్టుల తయారీ బాధ్యతను 'లిడ్ క్యాప్' సంస్థకు ఇచ్చామన్నారు. కానీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం వాటన్నింటినీ సెంట్రలైజ్ చేసి, స్థానిక కార్మికుల పొట్టగొట్టి మరీ గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "కాంట్రాక్టు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదు. ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు అందాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, పుస్తకాలు ఏవీ ఇప్పటివరకు పాఠశాలలకు చేరలేదు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభుత్వం పణంగా పెడుతోంది." అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. గతంలో స్కూల్ డ్రెస్సుల తయారీ బాధ్యతలను మహిళా స్వశక్తి సంఘాలకు అప్పగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్లు సమాచారం. ఒకవేళ పొరుగు రాష్ట్రాల కంపెనీలను కాదని, స్థానిక మహిళా సంఘాలకే ఈ పని అప్పగించి ఉంటే క్షేత్రస్థాయిలో మరింత మంచి ఫలితాలు రావడంతో పాటు, వేలాది మంది మహిళలకు ఉపాధి దొరికేదని విద్యారంగ నిపుణులు, ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. విపక్షాలు చేస్తున్న ఈ రూ.2,000 కోట్ల అవినీతి ఆరోపణలపై విద్యాశాఖ మరియు ప్రభుత్వం తక్షణమే స్పందించి, శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- 'స్ట్రాంగ్ కౌంటర్' ఇచ్చిన జైశంకర్
- రష్యాతో చమురు కొనుగోళ్లపై గట్టి సమర్థన
- 'అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదు..
- నాడే చమురు కొనమన్నారు'
- అంతర్జాతీయ వేదికపై ఎండగట్టిన భారత్



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అంతర్జాతీయ ఇంధన మార్కెట్, ఆంక్షల విషయంలో పాశ్చాత్య దేశాలు అవలంబిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు, పక్షపాత ధోరణిపై భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ మరోసారి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. రష్యా ఇంధన కొనుగోళ్లపై భారత్‌ను ప్రశ్నించే అర్హత ఐరోపా దేశాలకు లేదని ఆయన తెగేసి చెప్పారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. రష్యాతో భారత్ జరుపుతున్న ముడి చమురు కొనుగోళ్లను గట్టిగా సమర్థించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురును కొనుగోలు చేయాలని 2022లో అమెరికాయే స్వయంగా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించిందని ఈ సందర్భంగా జైశంకర్ ఒక సంచలన నిజాన్ని గుర్తు చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తోందన్న ఒక విదేశీ విలేకరి ప్రశ్నకు మంత్రి జైశంకర్ సూటిగా, ఘాటుగా బదులిచ్చారు. "భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశంపైనా ఎన్నడూ దాడి జరగలేదు. కానీ ఐరోపా దేశాలు అమ్మిన ఆయుధాలతో, మా ప్రత్యర్థులు భారతదేశంపై దాడులకు ఉపయోగించిన విషయాన్ని మీరంతా గుర్తుంచుకోవాలి. కొన్నేళ్లుగా ఇక్కడ ఇదే జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏనాడూ భారతీయులు చేయలేదు." అని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. రష్యా చమురు కొనుగోలుపై మొదట సుంకాలు విధించి.. ఆ తర్వాత మళ్లీ వాటిని సడలించిన పాశ్చాత్య దేశాల నిర్ణయాల్లో ఎలాంటి నైతికత లేదని, వాటికి గొప్ప సిద్ధాంతాలు ఆపాదించాల్సిన అవసరం లేదని మంత్రి కొట్టిపారేశారు. "మాకు ఎప్పటి నుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి నాడు ఐరోపా దేశాలు ఎక్కువగా క్రూడాయిల్ కొనుగోలు చేశాయి. దాంతో మేము మా దిశను మార్చుకోవాల్సి వచ్చింది. దేశ ఇంధన భద్రత, ఆర్థిక అంశాలు, జాతీయ ప్రయోజనాల ఆధారంగానే భారత ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుంది" అని జైశంకర్ స్పష్టం చేశారు.



## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

- మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ ఖతం కావడం ఖాయం
- వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కవు..
- సిద్దిపేట ఎమ్మెల్యే జోస్యం

**హుజూరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని ఆయన జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రాంతీయ పార్టీల దెబ్బకు కాంగ్రెస్ ఏ విధంగానైతే అధికారం కోల్పోయిందో, తెలంగాణలోనూ అదే పునరావృతం కాబోతోందని అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజల కష్టాల కంటే సొంత సోకులే ఎక్కువయ్యాయని హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదన్నట్లు, ప్రజల సొమ్ము రూ.100 కోట్లతో రేవంత్ రెడ్డి వందల గదుల సరికొత్త క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. సీఎం ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ సరిపోదనే నెపంతో ఐదు కోట్ల రూపాయలతో ప్రత్యేకంగా ఎయిర్ బస్ తెప్పించుకుంటున్నారు. ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీని ఇక్కడికి రప్పించే సోకుల కోసం, అందాల పోటీల నిర్వహణ కోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని నీళ్లలా తగలేశారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుండి కాంగ్రెస్ అధిష్టానానికి మూటలు పంపటానికి డబ్బులు ఉంటాయి కానీ, తెలంగాణలోని విద్యార్థులకు, రైతులకు ఇవ్వటానికి మాత్రం ప్రభుత్వానికి నిధులు ఉండవా? అని చురకలంటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా వంటి తీవ్ర సంక్షోభ సమయంలోనూ కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధును పూర్తిగా ఎగ్గొట్టిందని, ఆ తర్వాత విడతల్లో ఎకరా పరిమితులు పెడుతూ రూ. 20 వేల కోట్లు కోత పెట్టారని ఆరోపించారు. 45 రోజుల్లో రూ. 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామని సిద్దిపేటలో ప్రకటించిన రేవంత్ రెడ్డి, 65 రోజులు దాటినా పైసా విదల్చలేదన్నారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా పడకేసిందని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని, మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 లబ్ధి లేదు, రూ. 4 వేల పెన్షన్ ఊసే లేదని హరీశ్ రావు విమర్శించారు. సీఎం రేవంత్‌కు అధికారం మత్తెక్కిందని, అందుకే రైతులకు, పేదలకు డబ్బులు ఇవ్వడానికి మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సాగుతున్న ఈ 'హిట్లర్ పాలనను' అంతం చేయడానికి తెలంగాణ ప్రజలు కంకణం కట్టుకున్నారని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని రాష్ట్ర ప్రజలంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు.

## హనీట్రాప్‌లో చిక్కుకున్న మహిళా న్యాయమూర్తి

- రూ.52 లక్షలు స్వాహా!
- టిండర్ యాప్ పరిచయంతో బురిడీ కొట్టించిన కేటుగాడు
- పనిమనిషితో ఫిర్యాదు చేయించిన జడ్జి..
- గుట్టురట్టు చేసిన సెషన్స్ కోర్టు
- దర్యాప్తులో లోపాలపై కోర్టు ఆగ్రహం..
- నిందితుడి బెయిల్ పిటిషన్ తిరస్కరణ

**చండీఘడ్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజలకు న్యాయం చెప్పాల్సిన ఒక మహిళా న్యాయమూర్తి తానే స్వయంగా హనీట్రాప్ వలలో చిక్కుకుని ఏకంగా రూ.52 లక్షలకు పైగా నగదు పోగొట్టుకున్న సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. పరువు పోతుందనే భయంతో ఆమె నేరుగా రంగంలోకి దిగకుండా, తన ఇంట్లో పనిచేసే పనిమనిషితో పోలీసులకు ఫిర్యాదు చేయించడం ఇప్పుడు న్యాయ, పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. హరియాణాకు చెందిన సదరు మహిళా న్యాయమూర్తి మోసపోయిన తీరుపై సెషన్స్ కోర్టు విచారణలో ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి. పోలీసుల దర్యాప్తు వివరాల ప్రకారం.. సదరు మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో ప్రముఖ డేటింగ్ యాప్ 'టిండర్' ద్వారా అభిమన్యు వశిష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల్లోనే వీరి పరిచయం కాస్తా బలమైన బంధంగా మారింది. దీనిని ఆసరాగా చేసుకున్న అభిమన్యు.. కొన్ని వ్యాపారాల్లో పెట్టుబడి పెడితే భారీగా లాభాలు వస్తాయని ఆమెను నమ్మించాడు. అతడి మాటలు నిజమని నమ్మిన న్యాయమూర్తి.. దఫదఫాలుగా అతడి బ్యాంక్ ఖాతాలకు రూ.52 లక్షలకు పైగా నగదును ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు. ఎంతకాలం గడిచినా లాభాలు రాకపోగా, అసలు డబ్బు కూడా తిరిగి ఇవ్వకుండా నిందితుడు తప్పించుకు తిరగడంతో తానే స్వయంగా మోసపోయానని ఆమె ఆలస్యంగా గ్రహించారు. తాను ఒక జడ్జి అయి ఉండి డేటింగ్ యాప్ ద్వారా మోసపోయానని తెలిస్తే సమాజంలో పరువు పోతుందనే ఉద్దేశంతో ఆమె ఒక ఎత్తుగడ వేశారు. తన ఇంట్లో పనిచేసే మహిళా సహాయకురాలిని (పనిమనిషి) ముందరకు తెచ్చి, ఆమె పేరు మీద పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు అభిమన్యును అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టులో బెయిల్ రాకపోవడంతో నిందితుడు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ బెయిల్ పిటిషన్‌ను అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ విచారించగా అసలు గుట్టు బయటపడింది. "కేసు రికార్డులను పరిశీలిస్తే.. నిధుల లావాదేవీలన్నీ ఫిర్యాదుదారురాలైన (పనిమనిషి) ఖాతా నుండి కాకుండా, బాధితురాలైన మహిళా న్యాయమూర్తి సొంత బ్యాంక్ ఖాతాల నుంచే జరిగాయని స్పష్టమవుతోంది. పరువు కోసం ఫిర్యాదుదారులను మార్చడం సరికాదు." అని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ అభిప్రాయ పడ్డారు. ఈ కేసులో పోలీసుల దర్యాప్తు అత్యంత అసంపూర్తిగా, లోపభూయిష్టంగా సాగిందని సెషన్స్ కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. నిందితుడికి, మహిళా న్యాయమూర్తికి మధ్య జరిగిన పూర్తి వాట్సప్ చాటింగ్‌లను, కాల్ రికార్డులను పోలీసులు ఎందుకు సేకరించలేదని ప్రశ్నించింది. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉన్నందున నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. తక్షణమే టిండర్ యాప్, వాట్సప్‌లలో ఇరువురి మధ్య జరిగిన సంభాషణలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని, నిందితుడి మొబైల్ ఫోన్‌ను త్వరితగతిన ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపాలని దర్యాప్తు అధికారులను న్యాయస్థానం గట్టిగా ఆదేశించింది.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
శుక్రవారం, జూన్ 12, 2026

# క్రమశిక్షణ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


- 8 మంది అంగన్‌వాడీ సిబ్బందిపై వేటు
- విధులకు సుదీర్ఘకాలం గైర్హాజరు కావడంతో సేవలు రద్దు
- మూడు ప్రాజెక్టుల పరిధిలోని కార్యకర్తలు, ఆయాల తొలగింపు
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో క్రమశిక్షణను పటిష్టపరచడంతో పాటు సేవల నాణ్యతను మెరుగుపరిచే దిశగా జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ.ఎంఎస్. నెం.14 నిబంధనల మేరకు, దీర్ఘకాలంగా విధులకు హాజరు కాకుండా ఉన్న 8 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సేవలను రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కొంతమంది కార్యకర్తలు, ఆయాలు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా నెలల తరబడి, మరికొందరు సంవత్సరాల పాటు విధులకు గైర్హాజరవుతూ కేంద్రాల నిర్వహణకు తీవ్ర ఆటంకం కలిగించినట్లు కలెక్టర్ వెల్లడించారు. సంబంధిత శాఖ అధికారుల నివేదికలు, క్షేత్రస్థాయి విచారణ అనంతరం నిబంధనల ప్రకారం వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టి, సేవలను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంతో పాటు ఆరోగ్య సేవలు అందించే కీలకమైన వ్యవస్థ అని కలెక్టర్ స్పష్టం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల లబ్ధిదారులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడటానికే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అచ్చంపేట, బల్మూర్, కొల్లాపూర్ ప్రాజెక్టుల పరిధిలో పనిచేస్తున్న పలువురు అంగన్‌వాడీ సిబ్బంది 2023 ఫిబ్రవరి నుంచి 2026 జనవరి వరకు వివిధ కాలాల్లో విధులకు గైర్హాజరైనట్లు రికార్డుల ద్వారా స్పష్టమైందన్నారు. సంబంధిత ఐసీడీఎస్ అధికారుల పరిశీలన అనంతరం అందిన తొలగింపు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. జిల్లాలో సేవలు రద్దు చేయబడిన 8 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల వివరాలు ప్రాజెక్టుల వారీగా అచ్చంపేట జి.వెంకటమ్మ, ఎస్. అరుణ, బల్మూర్ జి.సుల్తానమ్మ, జె.మహాలక్ష్మి, కొల్లాపూర్ సి. పద్మావతి, నిరంజన్‌బెల్ల, కాశమ్మ, దర్జి బక్కమ్మలుగా ఉన్నారు. "జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ విధుల పట్ల పూర్తి బాధ్యతతో వ్యవహరించాలి. అనధికార గైర్హాజరు లేదా విధుల పట్ల నిర్లక్ష్యానికి పాల్పడితే భవిష్యత్తులో కూడా ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటాం." అని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ హెచ్చరించారు. ప్రభుత్వ సేవల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, మరియు క్రమశిక్షణకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం అంగన్‌వాడీలకే కాకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు తమ విధులను బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల అలసత్వం వహించినా, క్రమశిక్షణా ఉల్లంఘనలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# పంచాయతీ నిర్లక్ష్యానికి మూగజీవం బలి

## డంపింగ్ యార్డ్ చెత్త తిని ఆవు మృతి



**పదర, వాయిస్ ఆఫ్ వందే భారత్:** గ్రామాలను శుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల, పశువుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాల్సిన గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం ఒక సామాన్య రైతు కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పదర మండలంలోని ఒక గ్రామంలో పంచాయతీ పాలకులు, అధికారుల బాధ్యతారాహిత్యం కారణంగా ఒక పాడి ఆవు ప్రాణాలు కోల్పోయింది. డంపింగ్ యార్డ్ లోపల వేయాల్సిన చెత్తను, ప్రమాదకరమైన ప్లాస్టిక్ వ్యర్థాలను బాధ్యత లేకుండా రోడ్డుపై, బయట పారేయడమే ఈ మూగజీవం మరణానికి కారణమైంది. స్థానికంగా అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు వేడుకల మహేష్ యాదవ్‌కు చెందిన పాడి ఆవు రోజువారీగా మేత కోసం బయటకు వెళ్లింది. ఈ క్రమంలో స్థానిక డంపింగ్ యార్డ్ బయట కుప్పలుగా పడి ఉన్న ప్లాస్టిక్ కవర్లను, ఇతర వ్యర్థాలను మేత అనుకుని తిన్నది. ప్లాస్టిక్ పెద్ద మొత్తంలో కడుపులోకి వెళ్లడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన ఆ ఆవు అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. ఈ ప్రమాదం వల్ల తనకు సుమారు రూ. 60 వేల వరకు నష్టం వాటిల్లిందని, తన జీవనాధారమైన పాడి ఆవు చనిపోవడంతో కుటుంబం రోడ్డున పడిందని యజమాని మహేష్ యాదవ్ కన్నీరుమున్నీరయ్యారు.ఈ ఘోరంపై బాధిత రైతు మహేష్ యాదవ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "డంపింగ్ యార్డ్ పరిధిలో చెత్తను, ప్లాస్టిక్ కవర్లను లోపల వేయాలని, లేదా వాటిని ఎప్పటికప్పుడు కాల్చివేయాలని గ్రామ పంచాయతీకి, అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా. కానీ ఇక్కడి సర్పంచ్ గానీ, గ్రామ కార్యదర్శి గానీ కనీసం పట్టించుకోలేదు. వారి నిర్లక్ష్యం వల్లే ఈ రోజు నా ఆవు చనిపోయింది. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి." అని బాధిత రైతు వేడుకల మహేష్ యాదవ్ కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాలు, అధికారుల నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డుల నిర్వహణ కేవలం కాగితాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో పశువుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే నష్టపోయిన పేద రైతు కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# చెంచు మహిళలతో ముచ్చటించిన కలెక్టర్

- చిన్నారి ఆరోగ్యంపై ప్రత్యేక ఆరా..
- టీకాల ప్రాధాన్యతపై తల్లికి అవగాహన
- కలెక్టర్ మానవీయ దృక్పథంపై స్థానికుల హర్షం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తన మానవీయ కోణాన్ని మరోసారి చాటుకున్నారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని మన్ననూరులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వచ్చిన చెంచు గిరిజన మహిళలను ఆయన సాదరంగా పలకరించి, వారు చెప్పిన ప్రతి మాటను ఎంతో ఓపికగా విన్నారు. తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన మహిళల్లో ఒకరు చంకలో చిన్నారితో ఉండటాన్ని గమనించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఆప్యాయంగా దగ్గరకు పిలిచారు. ఆ చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి ప్రత్యేకంగా ఆరా తీశారు. "పాపకు వయస్సుకు అనుగుణంగా నెలవారీ వేయించాల్సిన అన్ని రకాల టీకాలు వేయించారా?" అని కలెక్టర్ తల్లిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల భవిష్యత్తు, ఆరోగ్య పరిరక్షణలో టీకాల ప్రాధాన్యత ఎంతో కీలకమని ఈ సందర్భంగా కలెక్టర్ ఆ తల్లికి వివరించారు. ప్రభుత్వ వైద్యశాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్న పోలియో, బీసీజీ వంటి అన్ని రకాల టీకా కార్యక్రమాలను గిరిజన కుటుంబాలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం చెంచు మహిళలతో ముచ్చటించిన కలెక్టర్, వారి దైనందిన జీవన పరిస్థితులు, సంక్షేమ అవసరాలు మరియు మారుమూల పెంటల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు తమ దృష్టికి తెచ్చిన స్థానిక సమస్యలను అక్కడికక్కడే నోట్ చేసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. అత్యున్నత స్థానంలో ఉన్న జిల్లా కలెక్టర్ హోదాను పక్కనబెట్టి, సామాన్య గిరిజన మహిళలతో నేరుగా మమేకమవడం, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ చూపిన చొరవ, ఆప్యాయతతో కూడిన పలకరింపు తమలో కొత్త నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంపొందించిందని చెంచు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

# బండి సంజయ్ పిలుపుతో 'మనబడి మన బాధ్యత'

- తిప్పాపురం హైస్కూల్‌లో స్వచ్ఛ భారత్!
- పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ
- ఎగ్జామ్ ఫీజుల చెల్లింపునకు నిర్ణయం



**కరీంనగర్/వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు "మనబడి మన బాధ్యత"లో భాగంగా తిప్పాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్కూల్ ఆవరణలో 'టిఫిన్ బ్రేక్' ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం సమిష్టిగా శ్రమదానం చేసి పాఠశాల పరిసరాలను, పిచ్చిమొక్కలను తొలగించారు. తరగతి గదులను ఊడ్చి, నీటితో కడిగి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ గారి విజయవంతమైన పాలనా కార్యక్రమాలలో భాగంగా తిప్పాపురం స్కూల్‌లో ఈ స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం చేపట్టామన్నారు. "కేంద్రమంత్రి బండి సంజయ్ గారి సారథ్యంలో గత సంవత్సరం తరహాలోనే ఈ ఏడాది కూడా పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులందరికీ ఏకకాలంలో ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేయనున్నాం. అలాగే వారి టెన్త్ క్లాస్ ఎగ్జామ్ ఫీజులను కూడా బండి సంజయ్ గారే చెల్లిస్తారు." అని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ అన్నారు. కార్యక్రమ ఇన్‌ఛార్జ్ ఎర్రం మహేష్ మాట్లాడుతూ.. దేశంలోని ఏ పార్లమెంట్ నియోజకవర్గంలో జరగని విధంగా కరీంనగర్ పరిధిలో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే కేంద్రమంత్రి బండి సంజయ్ గారి సూచనల మేరకే స్కూళ్ల క్లీనింగ్, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తున్నందుకు కరీంనగర్ ప్రజల తరపున మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక కౌన్సిలర్ మైలారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన వార్డు పరిధిలోని ప్రభుత్వ పాఠశాలను శుభ్రపరిచే మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ స్వచ్ఛంద శ్రమదాన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, కౌన్సిలర్ కుమ్మరి శంకర్, యువమోర్చా రాష్ట్ర నాయకుడు రేగుల రాజ్‌కుమార్, జిల్లా నాయకుడు రేగుల మల్లికార్జున్, కౌన్సిలర్ వంగల శ్రీనివాస్, పిన్నింటి హనుమాన్లు, రేగుల శ్రీకాంత్, మామిళ్ల లక్ష్మీరాజ్యం, చిక్కుడు మల్లేశం, వాసం మల్లేశం, బిల్ల కృష్ణ, నామాల శేఖర్, వివేక్ రెడ్డి, నేరెళ్ల సాయి, అన్నం నరసయ్య, జగన్నాథం శ్రీను, కిరణ్, మొక్సిత్, పట్టణ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని శ్రమదానం చేశారు.

# శాఖల మధ్య సమన్వయ లోపం.. పచ్చదనానికి శాపం!

- నడిరోడ్డుపై హరితహారం చెట్ల నిర్దాక్షిణ్య నరికివేత
- అచ్చంపేట పట్టణంలో విద్యుత్ సిబ్బంది అత్యుత్సాహం..
- స్థానిక ప్రజల ఆగ్రహం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం పర్యావరణానికి శాపంగా మారుతోంది. గత పదేళ్లలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి, ఎంతో ప్రతిష్టాత్మకంగా నాటిన హరితహారం మొక్కలు నేడు గొడ్డలి దెబ్బకు గురవుతున్నాయి. ఏపుగా పెరిగి, రహదారికి ఇరువైపులా బాటసారులకు చల్లని నీడను అందిస్తున్న వృక్షాలను విద్యుత్ శాఖ అధికారులు నిర్దాక్షిణ్యంగా నరికివేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రభుత్వ విధానాల్లో భాగంగా మండల విద్యుత్ అధికారుల ఆదేశాల నెపంతో కింది స్థాయి సిబ్బంది చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నారు. అచ్చంపేట పట్టణంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై, శంకర్ లింగం పాత పెట్రోల్ పంప్ ఎదురుగా గల రాజీవ్ నగర్ కాలనీ టర్నింగ్ వద్ద గురువారం ఉదయం ఈ దారుణం వెలుగుచూసింది. లైన్ మెన్ చందు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది అక్కడి పెద్ద చెట్లను పూర్తిగా తొలగించారు. మొక్కలు నాటే సమయంలోనే అటవీ, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు లేని చోట, భవిష్యత్తులో ఇబ్బంది కలగని స్థలాలను ఎంపిక చేసి మొక్కలు నాటి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ, అటవీ శాఖ అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా చెట్లను నరికివేసే ధోరణికి స్వస్తి పలకాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చెట్లను తొలగించిన ప్రాంతాల్లో విద్యుత్ తీగలు లేని సురక్షిత స్థలాలను ఎంపిక చేసి, తిరిగి కొత్త మొక్కలను నాటాలని, పచ్చదనాన్ని కాపాడటంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

# చెంచు గిరిజనుల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
- విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- ఐటీడీఏ మన్ననూరులో శాఖల వారీగా ప్రగతిపై కలెక్టర్ సమీక్ష



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఐటీడీఏ మన్ననూరు ప్రాజెక్టు పరిధిలో అమలవుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో జరిగిన ఈ సమావేశంలో చెంచు గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. చెంచు పెంటల్లో అమలవుతున్న కార్యక్రమాల పురోగతిని ఆయన శాఖల వారీగా కూలంకషంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన గిరిజన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. చెంచు కుటుంబాలకు విద్య, వైద్యం, తాగునీరు, పోషకాహారం, విద్యుత్, ఉపాధి అవకాశాలు వంటి ప్రాథమిక వసతులు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విద్యాశాఖ పనితీరుపై సమీక్షిస్తూ, చెంచు పెంటల్లోని పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి. వసతి గృహాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును నిరంతరం పర్యవేక్షించాలి. బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పించాలి. చెంచు విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రత్యేక ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలి. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల అందుబాటుపై కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన వైద్య సేవలు, టీకాలు, పోషకాహారం క్రమం తప్పకుండా అందేలా చూడాలన్నారు. ప్రతి చెంచు పెంటకూ ఆరోగ్య సిబ్బంది షెడ్యూల్ ప్రకారం వెళ్లి వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు. రానున్న కాలంలో చెంచు పెంటర్లలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనిచేయని బోర్లు, పైపులైన్లు, నీటి సరఫరా వ్యవస్థలను వెంటనే మరమ్మతు చేయాలన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా అవసరమైన ప్రాంతాల్లో సోలార్ పంప్ సెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. చెంచు యువత ఆర్థికాభివృద్ధి సాధించేలా స్కిల్ డెవలప్‌మెంట్ (నైపుణ్య శిక్షణ) కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని కలెక్టర్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యాల విస్తరణలో భాగంగా 'ఇందిరా సౌర గిరిజన విద్యుత్ పథకం' అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరాలంటే రేషన్ కార్డు సమస్యలు, ప్రభుత్వ ధ్రువపత్రాలు, ఆధార్ సంబంధిత సేవలు సులభంగా అందాలని, ఇందుకోసం ప్రత్యేక సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మొబైల్ నెట్‌వర్క్ ఉన్న ప్రాంతాల్లో శాశ్వత కేంద్రాలను, నెట్‌వర్క్ లేని మారుమూల ప్రాంతాల ప్రజల కోసం 'తాత్కాలిక సేవా కేంద్రాలను' ఏర్పాటు చేసి గిరిజనులకు సేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమం సమాజంలో చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం పెంచుకొని చెంచు గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి, స్థానిక సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు: ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఇన్చార్జ్ డీటీడబ్ల్యూఓ ఉమాపతి, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేసు, మిషన్ భగీరథ ఈఈ హేమలత, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ జాఫర్ హుస్సేన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జ్ఞానపీఠంపై నిలిచిన సాహితీ శిఖరం 'సినారె'

- ఘనంగా సినారె వర్ధంతి సభ
- సినారెను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన 'విశ్వంభర' కావ్య సృష్టికర్త, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి వర్ధంతి వేడుకలను రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సినారె తెలుగు సాహిత్య లోకానికి మహారాజుగా నిలిచారని కొనియాడారు. హన్మాజీపేట ముద్దుబిడ్డ అయిన నారాయణరెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన రాసిన ప్రతి అక్షరం, పాట తెలుగువారి మదిని తాకుతూనే ఉంటాయన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అత్యాధునికంగా నిర్మించిన 'సినారె స్మారక గ్రంథాలయం' ఆయన అభిమానులు, సాహిత్యకారుల హృదయాల్లో శాశ్వత జ్ఞాపకంగా నిలిచిందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. "సినారె తిరగాడిన నేల, మానేరు ఇసుక తిన్నెలు, మూలవాగు పరవళ్లు ఆయన పాటల్లో సజీవంగా ఉన్నాయి. 2017 జూన్ 12న ఆయన అక్షర శిఖరమై నింగికెగిసినా, సాహితీవేత్తలు, కవులు, రచయితలు నేటికీ ఆయనతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకుంటూనే ఉన్నారు." అని విక్కుర్తి లక్ష్మీనారాయణ అన్నారు. సినారె తన జీవితకాలంలో అందుకున్న అత్యున్నత పురస్కారాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 1988లో అత్యున్నత 'జ్ఞానపీఠ పురస్కారం' (విశ్వంభర కావ్యానికి), 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మభూషణ్, సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం, భారతీయ భాషా పరిషత్ పురస్కారం, రాజ్యలక్ష్మి అవార్డు, నంది పురస్కారాలు. అంబేద్కర్, మీరట్ విశ్వవిద్యాలయాల నుండి గౌరవ డాక్టరేట్లను పొందారు. సినారె కేవలం పద్య, గద్య కావ్యాలకే పరిమితం కాకుండా వివిధ ప్రక్రియల్లో 95 కి పైగా పుస్తకాలు రాశారని లక్ష్మీనారాయణ తెలిపారు. 'వెన్నెలవాడ' పత్రికకు సంపాదకత్వం వహించడంతో పాటు, తెలుగు చలనచిత్ర రంగానికి 3500కు పైగా మధురమైన పాటలను అందించి ప్రజాకవిగా నిలిచారన్నారు. నేటి యువ సాహితీవేత్తలు సినారెను ఆదర్శంగా తీసుకొని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నివాళి కార్యక్రమంలో ఉపాధ్యాయులు దర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ టీచర్లు లిక్కిడి మంజుల, పులి శారద, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# శని త్రయోదశి మహోత్సవం..

- శనీశ్వర ఆలయంలో పూజలు

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అచ్చంపేట పట్టణంలోని లింగాల్ రోడ్‌లో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వెనుక భాగంలో వెలసిన శనీశ్వర ఆలయంలో శని త్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ విశేషమైన రోజున స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, శాంతి పూజలు జరగనున్నాయి. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, అనుగ్రహం పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు. హిందూ ధర్మంలో శని త్రయోదశి రోజున చేసే పూజలకు ఎంతో ప్రాధాన్యత ఉందని అర్చకులు తెలిపారు. ఈ రోజున పూజలు చేయడం వల్ల మంచి ఫలితాలు కలుగుతాయని భక్తుల బలమైన నమ్మకం. ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని ప్రభావాల తీవ్రత తగ్గి ఉపశమనం లభిస్తుంది. ఉద్యోగం, వ్యాపార రంగాలలో సుదీర్ఘకాలంగా ఎదురవుతున్న అడ్డంకులు తొలగిపోతాయి. అప్పుల బాధల నుండి విముక్తి లభించి, ఆర్థిక



పరిస్థితి మెరుగుపడుతుంది. కుటుంబంలో కలహాలు సర్దుమణిగి మానసిక ప్రశాంతత, సుఖసంతోషాలు చేకూరుతాయి. శని దేవుని అనుగ్రహం కోసం భక్తులు ఈ పర్వదినాన కొన్ని ప్రత్యేక నియమాలు పాటించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. శనీశ్వర ఆలయాన్ని దర్శించుకుని, స్వామివారి సమక్షంలో నల్ల నువ్వుల నూనెతో దీపం వెలిగించాలి. పూజా సమయంలో 'శని గాయత్రి మంత్రం' లేదా "ఓం శం శనైశ్చరాయ నమః" అనే మంత్రాన్ని భక్తిశ్రద్ధలతో జపించాలి. పేదలకు, నల్లటి వస్త్రాలు లేదా అవసరమైన వస్తువులను దానం చేయడం మంచిది. శనిదేవుని వాహనమైన కాకులకు ఉదయాన్నే ఆహారం పెట్టాలి. శాస్త్రాల ప్రకారం కేవలం పూజలే కాకుండా.. నిత్య జీవితంలో భక్తి, సత్కార్యాలు, నిజాయితీతో జీవించేవారిపై శనిదేవుని కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆలయ పీఠాధిపతులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. పూజలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఆవరణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.